కథ

# కొండెక్కని దీపం

మౌనిక సుదర్శనం
70266 27444

చెట్లమీది

పూలన్నీ బతుకమ్మల పేరంటానికి ఇండ్లకు చేరినట్లు.. పొద్దుగూకే వేళ పక్షులన్నీ చెట్ల మీదికి చేరుకున్నట్లు.. అత్తగారిండ్లకు పోయిన ఆడబిడ్డలు బతుకమ్మ పండుగకు తల్లిగారిండ్లకు చేరుకుంటరు. ఆడబిడ్డల రాకతో.. ఊరి నిండా రంగురంగుల సీతాకోక చిలకలు వాలినట్లు, నగల ధగధగలతో, గాజుల గలగలలతో, గజ్జెల చప్పుళ్లతో, గంధపు సువాసనలతో.. ఊరు కొత్త పెండ్లికూతురులా ముస్తాబై మురిసిపోతది.

ఇక చిన్ననాటి ముచ్చట్లతో అరుగులు, బతుకు కష్టాల వలపోతతో మంచినీటి బావులు, మసక చీకట్లో వాకిట మంచాలమీద కూర్చొని పంచుకునే మాటల మూటలు, గుండెలనిండా దాగిన జ్ఞాపకాలను ఒంపుకొంటూ, గుండెచాటు గాయాలను తడిమి చూసుకుంటూ.. సంతోషాల పల్లకిలో ఊరేగుతూ, మనసు పొరల ఒరిపిడికి ఇంకిన కన్నీళ్లను ఓదార్చుకుంటూ.. ఇలా పసందైన మాటలతో, ఘాటెక్కిన వాదనలతో, మసాలా సంగతులతో ఊరంతా కుతకుతలాడుతది.

''అమ్మక్కో.. ఓ భూలచ్చిమి.. గౌరక్కా.. ఇంకా లేవలేదానే!? మబ్బుల్నే లేసి గాయిగాయి గత్తరగత్తర సేసేటిదిగాదె నీ ముద్దుల బిడ్డ! అవ్వల్లో ఇంకా లేవనే లేదా!? అవునుగాదు!? మరిసేపోయిన! ఇగ అక్క ఊరికొత్తాందని రాత్రి మా బావ గౌరక్కని నిద్రపోనిచ్చినట్లు లేదు! అందుకే మస్తుగ నిద్రవోతాంది'' అంది గౌరి వాళ్ల పిన్ని బిడ్డ సీత.

''ఓ పొల్లా.. ఏం మాటలే గవి? పోయి మీ అక్కని లేపుకోరాదే? ఈ పోరికి పెండ్లయినా ఇవురం రాలేదు. దీని మొగడు ఎట్లేగుతాండో ఏందో దీంతోని!?'' అంది.. వాకిలి ఊడుస్తున్న గౌరి తల్లి భూలక్ష్మి.

''అమ్మక్కా.. తమ్మున్ని సుత తోల్కపోతానం పూలు తెంపనీకి, గౌరక్కని లేపకులే.. దానిగ్గూడా మేమే కోసుకొత్తంతీ! పాపం దాన్ని పండనీయి'' అంటూ గిరుక్కున మళ్లిపోయింది సీత.

గొడ్లకొట్టంలో పెండకళ్లు తీస్తున్న సీత తండ్రి వెంకన్న..

''ఇగో.. నిన్నేనే?.. ఓపాలిట్రా?'' అని వాకిట్ల అలుకు జల్లుతున్న భార్యను పిలిచిండు.

''ఏందయ్యా..! అగ్గో.. గట్ల ఏడవబడ్తివి! పానం గిట్ల మంచిగలేదా ఏంది! జర్రుండు జప్పున గిన్ని మంచినీల్లు తెత్త''.. అంటున్న భార్యను ఆగమని చెయ్యితో ఇషారా చేసి.. పెండ్లాం దగ్గరికి వచ్చిండు వెంకన్న.

''నిన్న గౌరవ్వను తోల్కరాను బోయిన గదనే.. ఆళ్ల అత్త బిడ్డను సాగనంపుకొంట అనరాని మాటలన్నదే! 'లగ్గమై గిన్నొద్దులైనా పిల్లాజెల్లా లేని గొడ్డుబోతు దానివి! మాకేడ దాపురించినవే!' అని శాపనార్థాలు వెట్టిందే. 'ఈ పాలి మీ అవ్వకు జెప్పి డాక్టరుకు జూపించుకొని రా! రొండ్నెల్లల్ల కడుపున కాయబడకుంటే.. నా కొడుక్కు ఇంకో లగ్గంజేత్త! ఇగ నువ్వు మీ అవ్వగారింటికి బోతవో.. అడక్క తింటవో నీ ఇట్టం!' అని పిల్లను ఎట్లబడితే గట్లన్నదే! ఆ మాటలింటాంటే పానం సచ్చిపోయిందే! ఇగ గౌరవ్వ దారిపొంటంతా ముదాం ఏడుత్తనే ఉందే! భగమంతుడు కట్టాలన్నీ మనకే బెట్టినట్టుండే!'' అంటూ.. కండ్లనీళ్లు తుండుగుడ్డతో తూడ్సుకుంటా..

''సరెతీ.. పదిల పదకొండు అప్పోసప్పో జేద్దాం గని, బిడ్డను ఇయ్యల్నో రేపో పట్నం దోల్కపోయి మంచి డాట్టర్కు చూపించే!'' అన్నడు వెంకన్న పెండకళ్లను తట్టలకు ఎత్తుకుంటూ.

''దాన్నోట్లె మన్నువడ! దాని తలపండు వలుగ! దొంగముండ.. బిడ్డను రాసి రంపాన వెడ్తానట్లుంది. దాని నోటికి జడిసి బిడ్డ బువ్వగూడా సక్కంగ తింటానట్లు లేదు. పోరి దవుడలన్నీ గుంజుకపోయి చెంపలు లొట్టలువడి, యాడికాడికి ఎండుకపోయింది. బతుకమ్మ పండుగంటే బిడ్డకు పానం లెక్కుండేది. ఊల్లె పూలు, సెర్ల పూలు కోలుముందే తెంపి తెస్తుండె బిడ్డ. ఇప్పుడు పండుగన్న కయాలే లేకుండ బోయింది బిడ్డకు. ఈ పెండ్లిమీద మన్నువడ.. పెండ్లి దాని నెత్తిన నిప్పులు వోసి.. సంతోషాన్ని దిగమింగింది! అయినా దొంగబొడ్డి.. అదిగూడా ఆడిదేగదా! నాలుగొద్దులు ఆల్సమైతే గొడ్డుబోతని పేర్ల వెడతదా? ముందు దాని కొడుకును దవఖానాల జూపుమను. దుక్కిదున్నంగనే పంట పండుద్దా!? ఇచ్చాంత్రం గాకుంటే.. గట్టి ఇత్తనం పడొద్దా ఏంది?''

అని కాసేపు దమ్ము దీసి..

''నువ్వు సూత నామాట ఇన్నవా? వద్దయ్యా! పట్నపోళ్ల సంబంధం అంటే ఇనకపోతివి. 'బిడ్డ కట్టపడొద్దే.. మనలెక్క మట్టి పిసుకద్దే!' అని తన్లాడితివి. ఇప్పుడు జూడు దాని గతేమైందో!?..'' అని వలవల ఏడ్చింది భూలక్ష్మి.

కండ్లు నలుపుకొంట వాకిట్లకొచ్చిన బిడ్డను జూసి.. పెండ్లాం మొగలిద్దరు ఏం తెలియనట్లు మాట మడతబెట్టిండ్రు.

''అవ్వా! నేను ముగ్గెయ్యనానే?'' అంది గౌరి.

''అద్దుతీ బిడ్డ! నువ్ బోయి మొఖం గడుగు. నేను చాయివెడ్త'' అంది భూలక్ష్మి.

